క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రావికమతం : మరుపాక మోడల్ స్కూల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ సత్య సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదవ తరగతి పాసైన వారు ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీలో ప్రవేశానికి ఏపీఎంఎస్‌డాట్ ఏపీడాట్‌గవర్నమెంట్ డాట్ ఇన్‌లో లాగిన్ అయి ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 1 నుంచి నుంచి మే 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఆరవ తరగతిలో ప్రవేశాల గడువును ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్టు ఆయన తెలిపారు.

కోడ్ నేపథ్యంలో పేర్లు, గుర్తుల తొలగింపు



సబ్‌స్టేషన్ ఆవరణలో పేర్లు కన్పించకుండా మూసేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నాతవరం: ఎన్నికల కోడ్ అమలు విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 'పచ్చ నేతలకు కోడ్ వర్తించదా' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి మండల కార్యాలయాల్లోని శిలా ఫలకాలపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు పేర్లను ఆదివారం దగ్గరుండి మూసివేశారు. అలాగే మండల వ్యాప్తంగా ఉన్న జెండాలు, గుర్తులను సైతం తొలగించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



రాజాం జంక్షన్‌లో ఎస్‌ఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట : ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్‌ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం తెల్లవారు జాము నుండి రాత్రి వరకు బుచ్చెయ్యపేట, వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్, సీతయ్యపేట, రాజాం, బంగారుమెట్ట మూడు రోడ్ల జంక్షన్‌లో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు.

క్రీడాకారులకు రబ్బర్ మ్యాట్ల అందజేత



క్రీడాకారులతో చైర్మన్ నారాయణరావు, డైరెక్టర్లు శ్రావణ్, శ్రీకాంత్

నర్సీపట్నం: నింజాస్ అకాడమీలో బాక్సింగ్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు అకాడమీ డైరెక్టర్లు రబ్బర్ మ్యాట్లు అందజేశారు. రూ. 50 వేలు విలువ చేసే 45 స్పోర్ట్స్ మ్యాట్లను అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్లు సుతాపల్లి శ్రావణ్, శ్రీకాంత్ స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నారాయణరావు మాట్లాడుతూ ప్రాక్టీసు చేస్తున్న సమయంలో క్రీడాకారులు గాయపడుతున్నారని అన్నారు. ఇది గుర్తించి క్రీడాకారులకు రబ్బర్ మ్యాట్లు అందజేసామన్నారు. కోచ్ శేఖర్ చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో వార్డు మెంబర్ మృతి



చినతల్లి (ఫైల్)

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధిలో సమ్మెద వార్డు మెంబర్ టోకురు చినతల్లి ఆదివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందింది. ఆమె మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ సంతాపం వెలిబుచ్చారు. సమ్మెదలోని చినతల్లి మృతదేహం వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ దొమ్మండి బోడెమ్మ, బండి గౌరమ్మ తదితరులు సంతాపం తెలిపారు.



శృంగవరంలో సచివాలయ భవనం



హెల్త్‌క్లినిక్ భవనం



రైతు భరోసా కేంద్రం

ఊరు మారింది

శృంగవరం.. అభివృద్ధి పథం

- మౌలిక సదుపాయాలతో దూసుకుపోతున్న పంచాయతీ
- సచివాలయం, ఆర్బీకే కేంద్రం, హెల్త్ క్లినిక్, రహదారులతో నూతన శోభ
- గతంలో ఇంత మార్పు ఎన్నడూ చూడలేదంటున్న ప్రజలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పల్లెలు కొత్త సోయగాలు సంతరించుకుంటున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనతో నగరాలకు పోటీ పడుతున్నాయి. పాఠశాలలు, ఆస్పత్రులు, స్థానికంగానే ఏర్పాటు కావడంతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బాధ తప్పిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వపరంగా కూడా ఏ పని కావాలన్నా సచివాలయంలోనే అయిపోతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. వెనుకట్లా కాకుండా ఇప్పుడు ప్రజల అవసరాలన్నీ చక్కగా తీరుతున్నాయని పల్లెప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కితాబు ఇస్తున్నారు.

నాతవరం: మండలంలోని శృంగవరం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ.11 కోట్ల పైచిలుకు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా పథకం, హెల్త్ కినిక్‌లకు నూతన భవనాలు నిర్మించి గ్రామానికి కొత్త శోభ తీసుకువచ్చారు. పేదలందరికీ గూడు కల్పించే పనిలో భాగంగా జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. కాలనీకి వెళ్లేందుకు గెడ్డపై రూ. 25 లక్షలతో వంతెన నిర్మించారు. రోడ్డు ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ పరంగా ఏ పని చేయించుకోవాలనుకున్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం కొతగా ఏర్పాటు చేసిన సచివాలయంలోనే ప్రజలకు సేవలందిస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతు భరోసా కేంద్రంలోనే అందించడంతో అన్నదాతలు శ్రమ తప్పిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగులో సలహాలు, సూచనలు సైతం అందిస్తున్నారు. హెల్త్ క్లినిక్ ద్వారా రోగులకు వైద్య సేవలందించేందుకు నిత్యం డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలకు హెల్త్ క్లినిక్ ద్వారా ఉపశమనం అందిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారుల ఇళ్లకే చేరుతున్నాయి. ఇక్కడ జనాభా 1847 మంది. అయిదేళ్లలో మొత్తం రూ. 11,80,41,750 నిధులను ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఖర్చు చేసింది.



రూ.25 లక్షలతో జగనన్న కాలనీకి వంతెన నిర్మాణం



సిమెంటు రోడ్డు నిర్మాణం

వివిధ పథకాలు.. ఖర్చు చేసిన నిధుల వివరాలు

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 612 మందికి లబ్ధి
- జగనన్న విద్యా కానుక ద్వారా 52 మందికి రూ. 22 లక్షల 56 వేల లబ్ధి
- పేదలందరికీ ఇళ్లు పొందిన లబ్ధిదారులు 30 మంది
- వైఎస్సార్ అసరా పథకంలో 379 మందికి రూ. 56 లక్షలు 80 వేల లబ్ధి
- వైఎస్సార్ చేయూత పథకంలో 187 మందికి రూ. కోటి 32 లక్షల 18 వేల 750 లబ్ధి
- వైఎస్సార్ రైతు బరోసా పథకంలో 648 మంది రూ. కోటి 49 లక్షల 62 వేల లబ్ధి
- అమ్మఒడి పథకంలో 153 మందికి రూ. 11 లక్షల 17 వేల 500 లబ్ధి
- వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ఆరుగురికి రూ. 2 లక్షల 80 వేల లబ్ధి
- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా 91 మందికి లబ్ధి
- రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు రూ. 4 లక్షల 90 వేల లబ్ధి
- రూ. 3 కోట్లకు పైగా పెన్షన్ల పంపిణీ

బాధలు తప్పాయి..



గతంలో వరి విత్తనాలు, ఎరువులు తెచ్చుకోవాలంటే అనేక బాధలు పడేవాళ్లం. నేడు ఆర్బీకే ద్వారా వ్యవసాయానికి కావల్సినవి అందిస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. బ్యాంకులో రుణం కోసం భూమి రికార్డులు, వన్‌బీ, అడంగల్ సైతం సచివాలయంలోనే అందజేస్తున్నారు. గతంలో మాదిరిగా మండల కేంద్రానికి పోయే బాధలు తప్పాయి.

– పైల వరహాలబాబు, శృంగవరం

ఇంతటి మార్పు ఊహించలేదు..



గ్రామంలో ఇలాంటి మార్పు వస్తుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. కొత్త భవనాలతో పాటు వీధుల్లో సీసీ రోడ్లు వేసి గ్రామానికి కొత్త రూపు తెచ్చారు. సంక్షేమ పథకాలు ఇంటికే వస్తున్నాయి. బీపీ, సుగర్ వంటి వ్యాధులకు పరీక్షలు చేసుకోవడానికి బయటికి వెళ్లకుండా గ్రామంలో క్లినిక్ ఏర్పాటు చేశారు.

– పారువల్లి సత్తిబాబు, శృంగవరం గ్రామం

ఐక్యంగా పని చేస్తే అఖండ మెజారిటీ

ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్



గునుపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

నాతవరం: ఏ గ్రామం వెళ్లినా జగన్‌మోహన్ రెడ్డే మళ్లీ సీఎంగా రావాలని ప్రజలు కోరుతుంటే సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో ఆదివారం పీకే గూడెం, గునుపూడి, పెదగొలుగొండపేట సచివాలయాల పరిధిలో గల పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించారు. గతంలో మండలం నుంచి 9 వేల మెజార్టీ వచ్చిందన్నారు. అయిదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. మరల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని ప్రజలు అంటున్నారన్నారు. వారు అనుకున్న ప్రకారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేస్తే ఊహించని మెజార్టీ సాధిస్తామన్నారు. మాజీ మంత్రి అయ్యన్న తనయుడు విజయ్ గ్రామాల్లో పర్యటించి తప్పుడు మాటలు చెప్పి ప్రజల మెప్పు పొందడానికి చూస్తున్నారన్నారు. వారు చేసే కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, గన్నవరం, పీకే గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు గొర్లె వరహాలబాబు, ఎ. వరహాలబాబు, సర్పంచులు సోమ్మన్నదొర, వేమల సూర్యనారాయణ, మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు గాడి రమేష్ దేవి, పోలుపర్తి వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, గుడపర్తి అచ్చియ్యనాయుడు, మంకు సాంబమూర్తి, కరక అప్పలరాజు, పోలుపర్తి చిట్టిబ్బాయి, వేముల సూరిబాబు, కార్పొరేషన్ల డైరెక్టర్లు పైల పోతురాజు, శిరుసుపల్లి నర్సింగరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కళాసీల సంక్షేమానికి కృషి



అన్నవరంలో ప్రచారం చేస్తున్న విప్ ధర్మశ్రీ

చోడవరం : కళాసీల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరం పట్టణంలో కళాసీలతో సమావేశమయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. కూలీలు, కళాసీలకు బీమా, ఇతర సదుపాయాలతో కూడిన సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. చోడ వరం అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానని అన్నారు. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని బదనామ్ చేయాలని మెయిన్ రోడ్డు పనిని అరకొరగా వేసి నిలిపివేశారన్నారు. అయినప్పటికీ తన సొంత నిధులతో తాత్కాలికంగా కొంత పనిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్య లు తీసుకున్నామన్నారు. ఎన్నికలైన వెంటనే మెయిన్‌రోడ్డు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీగా బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ధర్మశ్రీ కోరారు. ఆయనకు కళాసీలంతా మద్దతు ప్రకటించారు. ఆ సంఘం ప్రతినిధులు, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కళ్లు మూసుకున్న టీడీపీకి అభివృద్ధేం కనిపిస్తుంది?

అభివృద్ధి ఏంటో ఈ ఐదేళ్లలో చేసి చూపించామని, టీడీపీ నాయకులు కళ్లు మూసుకోవడం వల్ల కనిపించడం లేదని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరం పట్టణ శివారు అన్నవరంలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. గడిచిన ఐదేళ్లలో రూ. 14 కోట్లతో శాశ్వత మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు ఇచ్చామని, చోడవరం పంచాయతీ పరిధిలో ఐదు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించామన్నారు. రూ. 4 కోట్లతో ప్రముఖ దేవాలయాలను అభివృద్ధి చేశామన్నారు. ఎటువంటి లంచాలు, మధ్యవర్తులు లేకుండా నేరుగా వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకు సంక్షేమం అందించామన్నారు. ఆ వ్యవస్థను కూడా కోర్టు, ఎన్నికల సంఘాల ద్వారా టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ధర్మశ్రీ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవరపల్లి సత్య, పందిరి శ్రీనివాసరావు, పాల సంఘం అధ్యక్షుడు పుల్లేటి సూరిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, పట్టణ అధ్యక్షురాలు యర్రా దేవి తదితరులు పాల్గొన్నారు.

తుస్సుమన్న గవిరెడ్డి మద్దతుదారుల బైక్ ర్యాలీ



దేవరాపల్లి మండలం మీదుగా అరకొర జనంతో సాగుతున్న టీడీపీ బైక్ ర్యాలీ

దేవరాపల్లి/మాడుగుల : టీడీపీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు మద్దతుగా చేపట్టిన బైక్ ర్యాలీకి ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు డుమ్మా కొట్టారు. మాడుగుల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పైలా ప్రసాదరావును అధిష్టానం ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ గవిరెడ్డి రామానాయుడు వర్గం చేపట్టిన బైక్ ర్యాలీకి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ఆ వర్గం డీలా పడింది. అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టడంతోనే బైక్ ర్యాలీకి వారు దూరంగా ఉన్నట్లు సమాచారం. మాడుగుల మండలంలో ప్రారంభమైన బైక్ ర్యాలీ చీడికాడ, దేవరాపల్లి మండలాల మీదుగా సాగి కె.కోటపాడులో ముగిసింది.

వలంటీర్లంటే బాబు వెన్నులో వణుకు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట : ప్రజలకు నేరుగా సేవలందించే వలంటీర్లంటే మాయ మాటలు చెప్పే చంద్రబాబుకి వెన్నులో వణుకు పుడుతుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండల కేంద్రం రోలుగుంటలో జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. కూటమి వారి స్వలాభమే కోసమే పని చేస్తుందని, ప్రజలకు మేలు చేయదన్నారు. వలంటీర్ల సేవలతో అన్ని వర్గాల వారు సంతోషంగా ఉన్నారన్నారు. అది సహించలేని చంద్రబాబు తన అనుయాయులతో ఎన్నికల నియమావళి పేరుతో ఏప్రిల్ 1 నుంచి అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు అందకుండా కుట్ర చేశారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి అమ్మా మీకు మేలు జరిగిందా లేదా అని తెలుసుకుని ఓటు అడిగే హక్కు మన పార్టీకే ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, వైస్ ఎంపీపీ దోపత్ని రాజు, చలన చిత్ర నటుడు గొంధు సిద్దు, రోలుగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మడ్డు తాతబాబు, పార్టీ సీనియర్ నాయకులు శెట్టి సత్యనారాయణమూర్తి, పోతల లక్ష్మీ శ్రీనివాస్, గొర్లె చెల్లంనాయుడు, సర్పంచ్‌లు కుంచంగి హరిబాబు, ఉలబాల రాము, తమటపు సత్యంనాయుడు పాల్గొన్నారు.

బూడి, అనురాధల గెలుపు ఖాయం



అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న సబ్బవరం వైఎస్సార్‌సీపీ నాయకులు



మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధను సత్కరిస్తున్న చీడికాడ నాయకులు



ఎంపీ అభ్యర్థి బూడిని కలిసిన ఎ.కోడూరు నాయకులు

దేవరాపల్లి : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించే వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధల గెలుపు ఖాయమని పలువురు ప్రజలు, నాయకులు స్పష్టం చేశారు. తారువలో ముత్యాలనాయుడును, అనురాధను ఆదివారం కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మేజర్ పంచాయతీ సబ్బవరం ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మండల లక్ష్మణరావు ఆధ్వర్యంలో 13 కార్లలో సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడును కలిశారు. సబ్బవరం మాజీ సర్పంచ్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొంప దేముడు, న్యాయవాది పైడంనాయుడు, గొర్లె శ్రీనివాసరావు, సబ్బవరపు శివ, బోకం రామకృష్ణ, గొల్లు రమణ, దడ్డెం పద్మావతి, సబ్బవరపు సత్యనారాయణ, బొడ్డు నాగేష్, నాగభూషణం, చీడికాడ గ్రామశాఖ అధ్యక్షుడు పరవాడ మహేష్, సచివాలయ కన్వీనర్ పరవాడ రామారావు, పరవాడ ప్రసాదరావు, వార్డు మెంబర్ పరవాడ అప్పలనాయుడు, వీరవిల్లి అగ్రహారం గ్రామ సర్పంచ్ వెలగాడ ఈశ్వరరావు, భోగాది శంకరరావు, కోన శ్రీను, రామారావు, భోగాది జోగారావు, ఎల్లపు నాయుడు, గవరపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు నెకెళ్ల పెంటయ్య, దుంగ సత్యనారాయణ, కక్కల పారిపల్లి, కర్రి వెంకటరావు, గొలగాని సింహాద్రి, సిమ్మ సంతోష్, అనురాధను కలిశారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు అభినందనలు..

కె.కోటపాడు : ఎ.కోడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఎంపీ అభ్యర్థి బూడి,ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధలను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ సచివాలయ కన్వీనర్ బొడ్డు శ్రీను, మాజీ పీఎంసీ కమిటీ చైర్మన్ పుట్టా శ్రీధర్, కోటకల నానాజీ, శెట్టి శ్రీను, రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

బూడి, అనురాధలను కలిసిన వీరవిల్లి అగ్రహారం నేతలు..

మాడుగుల రూరల్ : పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధలను శనివారం మండలంలోని వీరవిల్లి అగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సర్పంచ్ వెలగాడ ఈశ్వరరావు, బోగాది శంకరరావు, కోన శ్రీను, రామారావు, బోగాది జోగారావు, ఇల్లపు పిట్ట నాయుడు, ఎల్లపు నాయుడు ఆకాంక్షించారు.

పైడితల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

మాడుగుల రూరల్ : పోతనపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో క్షీరాధివాసం, పుష్పాధివాసం, ఫలాధివాసం, క్షయాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అమ్మ వారి విగ్రహ ప్రతిష్ట జరపనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా రాట ఉత్సవం

మాడుగుల రూరల్ : కొత్త అమావాస్య రానున్న దృష్ట్యా నూకాలమ్మ జాతరను పురస్కరించుకుని మాడుగుల నూకాంబిక ఆలయం వద్ద ఆదివారం పండగ రాట వేశారు. ఏప్రిల్ 8న అమ్మవారి పండగ నిర్వహించనున్నారు. కమిటీ సభ్యులు చేబ్రోలు జగన్, దాసరి ఈశ్వరరావు, అప్పారావు, కొండలరావు, జగదీశ్, పెరుముచ్చి అప్పారావు, పెంటకోట నాయుడు, నక్కా తలుపులు, ఆలయ పూజర్లు బొబ్బిలి రమణమ్మ, సమ్మంగి గాటీలు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఇంటింటి ప్రచారం



తైపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంచి జరిగిందా లేదా అని ఆలోచించి ఓటు వేయాలని జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, చోడవరం నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షుడు కరణం సూర్య ప్రజల్ని కోరారు. ఆదివారం తైపురంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని రెండో సారి గెలిపించాలని కోరుతూ ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని గెలిపించాలని కోరారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, మండల ఇన్‌చార్జి గేదెల శేషు, సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను, మండల సచివాలయ కన్వీనర్ కె. అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ డేగల అప్పారావు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక



సాయి శరణ్య



గొలుగొండ సాయితేజ

కె.కోటపాడు : అయ్యన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన పూతిక సాయి శరణ్య నవోదయ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన అర్హత పరీక్షలో పాల్గొన్న సాయి శరణ్య ప్రతిభ చూపడంతో విశాఖపట్నంలో గల నవోదయ పాఠశాలకు ఎంపికయింది. నవోదయ ఫలితాలను ఆదివారం విడుదల చేసిన నేపథ్యంలో సాయి శరణ్య ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఖాసిమ్ తెలిపారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట : మండలంలోని దిబ్బిడి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి గొలుగొండ సాయితేజ ప్రతిభ కనబరిచి సైనిక్ స్కూల్, నవోదయ ఫలితాల్లో విజయం సాధించాడు. ఇటీవల జరిగిన నవోదయ, సైనిక్ స్కూల్ పరీక్షలకు హాజరైన సాయితేజ రెండు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. సాయితేజ, అతని తల్లిదండ్రులను ఎంఈవో, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



కొండల అగ్రహారం చర్చిలో ప్రసగిస్తున్న జీవన్‌రాయ్

మాకవరపాలెం : మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులంతా ముందుగా తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్ధనలు చేశారు. కొండల అగ్రహారం ఇమ్మానుయేలు చర్చిలో బిషప్ కె.జీవన్‌రాయ్ ఈస్టర్ సందేశాన్ని వినిపించారు. అలాగే మండల కేంద్రంలోని పెంతుకొస్తు ప్రార్ధనా మందిరంలో జరిగిన వేడుకల్లో రెవరెండ్ టి.వి.రత్నం, పాస్టర్ విక్టర్‌పాల్ ఈస్టర్ ప్రత్యేకతను తెలియజేశారు.

కార్యకర్తల సమావేశం నేడు

మాడుగుల : మాడుగుల మండలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం శ్రీబసవ రామ పరమేశ్వరరావు గొడౌన్ వద్ద సోమవారం సాయంత్రం 3 గంటలకు జరుగుతుందని ఎంపీపీ తాళపురెడ్డి వెంకట రాజారామ్, మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ తెలిపారు.